క్లుప్తంగా

త్రిముఖలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో త్రిముఖలింగేశ్వరస్వామి

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు శ్రీబాలా త్రిపుర సుందరీ సమేత త్రిముఖలింగేశ్వరస్వామికి మాసశివరాత్రిని పురస్కరించుకుని అర్చకులు రమణశర్మ, భాస్కరశర్మ, శ్రీనివాసశర్మల ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రకాల అభిషేక ద్రవ్యాలతో స్వామివారిని, అమ్మవారిని అభిషేకించి అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ పడాల వెంకటరామారెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వేంకటేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

పెదపూడి: మండలంలోని సంపర వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఆలయ అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు స్వామివారికి పంచామృతాభిషేకాలు చేశారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక తులసి పూజ, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులచే విష్ణు సహస్ర నామాలు చేయించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు.

ట్రెంచ్ పనులను సద్వినియోగం చేసుకోవాలి

రంగంపేట: ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల్లో మొక్కల చుట్టూ ఏర్పాటుచేస్తున్న రింగ్ ట్రెంచ్ పనులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న అన్నారు. ఈలకొలను గ్రామ సచివాలయంలో సర్పంచ్ చింతపల్లి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఉపాధి గ్రామసభకు ఆయన హాజరై మాట్లాడారు. అనంతరం ఉపాధి హామీ పథకంలో భాగంగా 2024–25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టబోయే పనుల గురించి గ్రామసభలో చర్చించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాయుడు రాంబాబు, ఏపీఓ జి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చెరువులో చేప పిల్లల విడుదల



పెదరాయవరం చెరువులో చేప పిల్లలను వదులుతున్న ఫిషర్‌మెన్ సొసైటీ సభ్యులు

రంగంపేట: మండలంలోని పెదరాయవరం జగ్గరాజు చెరువులో స్థానిక ఫిషర్‌మెన్ సొసైటీ సభ్యులు శనివారం చేప పిల్లలను విడుదల చేశారు. అనంతరం ఫిషర్‌మెన్ సొసైటీ అధ్యక్షుడు బచ్చల గంగరాజు మాట్లాడుతూ ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకంలో భాగంగా పలు గ్రామాల్లోని మైనర్ ఇరిగేషన్ చెరువుల్లో 40,300 చేప పిల్లలను విడుదల చేసే కార్యక్రమం చేపట్టడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో ఫిషర్‌మెన్ సొసైటీ ఉపాధ్యక్షుడు రొంప ప్రసాద్, బరగటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర కబడ్డీ జట్టుకు ఎంపిక



రాష్ట్ర కబడ్డీ జట్టుకు ఎంపికైన విద్యార్థులతో పీఈటీ శ్రీనివాస్ తదితరులు

పెదపూడి: కాకినాడ జిల్లా కేంద్రంలోని క్రీడా మైదానంలో జరిగిన అండర్–14 కబడ్డీ ఎంపికల్లో సంపర జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు దూళ్ల చిన్న, ఏరుబండి రాము అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారని హెచ్‌ఎం త్రిమూర్తులు, పీఈటీ శ్రీనివాస్ శనివారం తెలిపారు. విద్యార్థులను సర్పంచ్ అద్దంకి మాచరమ్మ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ సలాది విమల, ఎంపీటీసీ సభ్యుడు శ్రీరామచంద్రమూర్తి, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ మట్టా రామఅయ్యన్న తదితరులు అభినందించారు.

కూరగాయల సాగు.. లాభాలు బాగు

- మెట్టలో పెరుగుతున్న విస్తీర్ణం
- పట్టణాలకు తరలించి విక్రయాలు

రంగంపేట: మెట్టప్రాంతమైన రంగంపేట మండలంలో ఒకప్పుడు వరి, పత్తి, పొగాకు వంటి పంటలపై ఆధారపడిన రైతులు ఇప్పుడు లాభాలు ఆర్జించే పంటలపై మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా ఖరీఫ్‌లో అతివృష్టి, అనావృష్టి కారణంగా వరి, పత్తి, మినుము పంటలతో నష్టాలు పరిపాటిగా మారింది. అందుకే అన్నదాతలు ప్రత్యామ్నాయంగా కూరగాయల సాగుపై మక్కువ పెంచుకుంటున్నారు. పండించిన కూరగాయలను స్థానికంగా అమ్ముకోవడమే కాకుండా పట్టణాలకు తరలించి విక్రయించి లాభాలు పొందుతున్నారు.

డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని

ఒకప్పుడు పొలం గట్లకే పరిమితమైన కూరగాయల పంటలు ఇప్పుడు మండలంలోని సుమారు 1099 ఎకరాలకు చేరుకున్నాయి. పెట్టుబడి ఎక్కువైనా నష్టం పెద్దగా ఉండదనే నమ్మకంతో రైతులు కూరగాయల పంటల సాగును ఎంచుకుంటున్నారు. అధిక వర్షాలొచ్చినపుడు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే కూరగాయల దిగుమతులు తగ్గిపోయి స్థానికంగా పండించే పంటలకు మంచి గిరాకీ ఏర్పడుతుంది. దీంతో ధర గిట్టుబాటుగానే ఉంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. అందుకే ఖరీఫ్ సీజన్‌లో వరి పంటకు బదులుగా కూరగాయలు, ఉద్యాన పంటలకు ప్రాధాన్యమిస్తున్నారు.



వడిశలేరులో సాగు చేస్తున్న దొండ పాదులు

మంచి లాభాలొచ్చే అవకాశం

మండలంలోని రంగంపేట, వడిశలేరు, చంద్రేడు, పెదరాయవరం, కోటపాడు, వెంకటాపురం, మర్రిపూడి, సింగంపల్లి, నల్లమిల్లి, దొడ్డిగుంట, సుభద్రంపేట, ముకుందవరం, దొంతమూరు, వీరంపాలెం, ఈలకొలను తదితర గ్రామాల్లో కూరగాయల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. మండలంలో ఎక్కువగా బీర, బెండ, దొండ, ఆనబ, మిరప, వంగ, చిక్కుడు, గోరు చిక్కుడు, కాకర, గుమ్మడి, కర్రపెండలం తదితర కూరగాయ పంటలతో పాటు ఆకుకూరలైన తోటకూర, గోంగూర, పాలకూరలు సాగు చేస్తున్నారు. కూరగాయల సాగుకి ఎకరానికి సుమారు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకూ పెట్టుబడి అవుతుంది. వీటికి ఎటువంటి తెగుళ్ల వ్యాపించకుండా ఉంటే ఎకరానికి అంతే మొత్తంలో లాభాలు వచ్చే అవకాశముంటుందని రైతులు చెబుతున్నారు.



రంగంపేటలో బెండ చేను

వరికి బదులుగా కూరగాయల సాగు



వరి పంట ఆశించినంత లాభం ఉండకపోగా ఏటా ఖరీఫ్‌లో తీవ్రంగా నష్టపోతున్నాం. అందుకే ఖరీఫ్‌లో వరికి బదులుగా కూరగాయల సాగు చేస్తున్నాను. ప్రభుత్వం కూరగాయల పంటలకు విత్తనాలు సరఫరా చేయాలి.
– దేసాల బుజ్జి, రైతు, నల్లమిల్లి

మార్కెటింగ్ సదుపాయం కల్పించాలి



ఎకరం భూమిలో బీర, వంగ సాగు చేస్తున్నాను. పండించిన కూరగాయలకు ప్రభుత్వం మార్కెటింగ్ కల్పిస్తే మరింత లాభాలు పొందుతాం. అలాగే వరికి ఇచ్చినట్లుగానే కూరగాయలకు కూడా ప్రభుత్వం అధిక రాయితీలు అందించాలి.
– చల్లపిల్లి వీరబాబు, రైతు, నల్లమిల్లి

ప్రభుత్వం రాయితీలిస్తోంది



కూరగాయ పంటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం రాయితీలు కల్పిస్తుంది. రైతులు దరఖాస్తు చేసుకుంటే హైబ్రిడ్ విత్తనాలపై ఒక హెక్టారుకు రూ.3 వేల రాయితీ అందిస్తాం. తీగజాతి కూరగాయలు పండించే రైతులకు శాశ్వత పందిర్లకు గాను ఎకరాకు రూ.లక్ష రాయితీ వస్తుంది.
– కె.శ్రీదివ్య, హార్టికల్చర్ అధికారి, రంగంపేట

నిబంధనలు పాటించాలి

సీతానగరం: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు నిబంధనలను పాటించాలని, వాటిని అధిగమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంఈవో కె.స్వామినాయక్ హెచ్చరించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 24 వరకు దసరా సెలవులు ఉన్నాయని, సెలవుల సమయంలో అదనపు తరగతులు, స్పెషల్ క్లాస్‌లు జరపరాదన్నారు. సిలబస్ పూర్తి కాలేదనే నెపంతో స్టాఫ్ మీటింగ్‌లు, వర్క్‌షాప్, రిజిస్టర్ వర్క్ పేరులతో అదనపు తరగతులు నిర్వహిస్తే ఆ విద్యాసంస్థలపై చర్యలు తీసుకుంటామన్నారు.

దసరాకు ప్రత్యేక బస్సు సర్వీసులు



ప్రత్యేక బస్సు సర్వీసుల వివరాలు వెల్లడిస్తున్న గోకవరం ఆర్టీసీ డీఎం రామన్నదొర

గోకవరం: దసరా పండగను పురస్కరించుకుని గోకవరం ఆర్టీసీ డిపో నుంచి వివిధ ప్రాంతాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ యు.రామన్నదొర తెలిపారు. స్థానిక ఆర్టీసీ డిపోలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. గోకవరం డిపో నుంచి విజయవాడ, శ్రీశైలం, భద్రాచలం వంటి పుణ్యక్షేత్రాలకు దసరా సెలవుల్లో ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నామన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



కాపవరంలో మహిళలకు ధ్రువపత్రాలను అందజేస్తున్న సర్పంచ్ సత్యంశెట్టి వెంకటరమణ

ధ్రువపత్రాల అందజేత

బిక్కవోలు: మండలంలోని కాపవరంలో టైలరింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్పంచ్ సత్యంశెట్టి వెంకటరమణ ధ్రువపత్రాలను శనివారం అందజేశారు. కాపవరంలో డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ ద్వారా టైలరింగ్, మగ్గం వర్క్‌లో 70 మంది శిక్షణనిచ్చామని ఫౌండేషన్ మేనేజర్ సుంకర నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు వీరాస్వామి, వినీల, హేమనళిని పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు సిద్ధం

సీతానగరం: ఖరీఫ్‌లో ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి కేంద్రాలు సిద్ధంగా ఉన్నాయని మండల రైతు భరోసా కేంద్రాల చైర్మన్ వలవల వెంకట్రాజు తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని మిర్తిపాడు, కాటవరం, చినకొండేపూడి, రామచంద్రపురం, సింగవరం, రాపాక, రఘుదేవపురం ఆర్బీకేల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఆర్బీకేల వీవీఏలు నూరుశాతం ఈ క్రాప్ బుకింగ్ చేయడం అభినందనీయన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఈ కేంద్రాల్లో అమ్మకాలు జరుపుకోవచ్చన్నారు. వీఏఏతో పాటు డేటా ఎంట్రీ ఆఫీసర్, టెక్నికల్ అసిస్టెంట్, హెల్పర్లు ఉంటారన్నారు.

మైనార్టీల పక్షపాతి సీఎం జగన్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆరిఫ్ తదితరులు

సీటీఆర్ఐ: ముస్లిం మైనార్టీల పక్షపాతి సీఎం జగన్ మోహన్‌రెడ్డి అని వక్ఫ్‌బోర్డు జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఆరిఫ్ అన్నారు. హర్ దిల్ మే వైఎస్సార్ – హమ్ సబ్ జగన్‌కే సాత్ కార్యక్రమంలో భాగంగా డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, పార్టీ మైనారిటీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వి.ఖాదర్ బాషా ఆదేశాల మేరకు ఆయన శనివారం నగరంలోని పలు మసీదులను సందర్శించారు. ఈ సందర్భంగా మసీదు కమిటీ సభ్యులు, స్థానిక ముస్లింలతో సమావేశాలు నిర్వహించి పోస్టర్లు పంపిణీ చేశారు మహమ్మద్ ఆరిఫ్ మాట్లాడుతూ ఉర్దూకు రెండో అధికారభాష హోదా కల్పించడంతో పాటు, గతంలో రూ.8 వేలు ఉన్న మసీదు ఇమాం, మౌజన్‌ల జీతాలను రూ.15 వేలకు పెంచి జగన్ తన పెద్ద మనసును చాటుకున్నారన్నారు. వక్ఫ్ భూములను సంరక్షించడంతో పాటు కర్నూలులో వక్ఫ్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేసి వక్ఫ్ ఆస్తుల రక్షణకు చేపట్టిన ముందస్తు చర్యలను ముస్లిం మైనారిటీలు హర్షిస్తున్నారని అన్నారు. మసీదుకు సంబంధించి, ముస్లింలకు స్థానికంగా ఉన్న అవసరాలు ఏమిటో అడిగి తెలుసుకున్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థి ఎంపిక



సత్యవీరదుర్గబాబు

గోకవరం: మండలంలోని కామరాజుపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థి దారపు సత్యవీరదుర్గబాబు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల హెచ్‌ఎం ఈశ్వరీదేవి శనివారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కాకినాడలో జరిగిన జిల్లాస్థాయి అండర్–14 కబడ్డీ పోటీల్లో సత్యవీర దుర్గబాబు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు వివరించారు. విద్యార్థి దుర్గబాబును హెచ్‌ఎంతో పాటు పాఠశాల చైర్మన్ కోటిన లోవకుమార్, సర్పంచ్ అడపా వెంకట్రావు, కొత్తపల్లి సర్పంచ్ కాటమస్వామి, ఉపాధ్యాయులు అభినందించారు.

కొనసాగుతున్న ఉమెన్ మెడికోస్ గేమ్స్



టేబుల్ టెన్నిస్‌లో తలపడుతున్న విద్యార్థినులు

రాజానగరం: డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ పరిధిలోని మెడికల్, డెంటల్ కళాశాలల విద్యార్థినులకు స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న ఉమెన్ మెడికోస్ ఆటల పోటీలు రెండోరోజైన శనివారం కూడా కొనసాగాయి. ఆదివారం ఫైనల్స్ జరగనున్నాయి. వాలీబాల్, బాస్కెట్ బాల్, త్రోబాల్, షటిల్ బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, టెన్నిస్, టేబుల్ టెన్నిస్, చెస్ తదితర వాటిలో 450 మంది విద్యార్థినులు పోటీపడుతున్నారని యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి డాక్టర్ ఈ.త్రిమూర్తి, కాలేజీ పీడీ శ్రీనివాసులు తెలిపారు.

ఇంటింటా సంక్షేమ వెలుగులు



బిక్కవోలులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- బిక్కవోలులో గడప గడపకూ మన ప్రభుత్వం

బిక్కవోలు: ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ఇంటింటా వెలుగులు నిండుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని బిక్కవోలులో శనివారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేకు గడప గడపలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఓ వైపు అభివృద్ధి కొనసాగిస్తూనే మరోవైపు నిరంతరాయంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రభుత్వం పథకాలు అందజేస్తోందన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో అభివృద్ధికి రూ.20 లక్షల నిధులను ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. సచివాలయాల ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు అందజేస్తున్న ఘనత సీఎం జగన్‌దేన్నారు. రాబోయే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రి చేసుకుందామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సరెళ్ల సుమలత, ఉప సర్పంచ్ జంగా మురళీకృష్ణారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ జంగావీర వెంకట సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ చైర్మన్ రొంగల అప్పాజీ, గువ్వల సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనపర్తిలో అగ్నిప్రమాదం



మంటలను అదుపుచేస్తున్న అనపర్తి అగ్నిమాపక సిబ్బంది

అనపర్తి: స్థానిక మెయిన్ రోడ్డులోని గాంధీబొమ్మ సెంటర్ సమీపంలో గల మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్‌లో షాప్ నెంబరు 24, 25ల్లో నిర్వహిస్తున్న టిఫిన్ హోటల్‌లో శనివారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అనపర్తి అగ్నిమాపక కేంద్రం అధికారి జె.శ్రీనివాసరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ద్వారంపూడి వెంకటరామారెడ్డికి చెందిన జానకిరామయ్య టిఫిన్ హోటల్‌లో శనివారం గ్యాస్ లీకేజీ కారణంగా అగ్నిప్రమాదం సంభవించింది. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేయడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రమాదంలో సుమారు రూ.75 వేల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక అధికారి జె.శ్రీనివాసరెడ్డి తెలిపారు.

దాతల సహకారం అభినందనీయం



వైద్య పరికరాలను అనపర్తి ఏరియా ఆసుపత్రికి అందజేస్తున్న సబ్బెళ్ల కృష్ణారెడ్డి తదితరులు

అనపర్తి: అనపర్తి ఏరియా ఆసుపత్రి అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రికి రూ.56 వేలు విలువ చేసే స్ట్రెక్చర్, 8 బీపీ మెషీన్లు, 3 వీల్ చైర్లు దాతలు సమకూర్చారు. సదరు వైద్య పరికరాలను ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, ఏపీ శాసనసభ స్పీకర్ ప్రత్యేక అధికారి పడాల సత్యనారాయణరెడ్డిల చేతుల మీదుగా ఆసుపత్రికి శనివారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వారా కుమారి, వైస్ ఎంపీపీ కర్రి దాసు, దాత సత్తి పోతారెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగురెడ్డి, ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ తరుణ్, సత్తి వెంకటరెడ్డి, పార్టీ జిల్లా వాణిజ్యవిభాగం అధ్యక్షుడు ఎస్ఎస్, బాల, జి.లక్ష్మీదుర్గ తదితరులు పాల్గొన్నారు.

దసరా వచ్చిందయ్యా..

- నేటి నుంచి శరన్నవరాత్ర ఉత్సవాలు
- సర్వాంగ సుందరంగా ముస్తాబైన గోకవరం దేవీచౌక్ ఆలయం
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ సభ్యులు





గోకవరంలో శరన్నవరాత్ర ఉత్సవాలకు ముస్తాబైన దేవీచౌక్ ఆలయం. (ఇన్‌సెట్‌లో) ఆలయంలో కొలువై ఉన్న శ్రీకనకదుర్గమ్మ వారు

గోకవరం: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ప్రసిద్ధిగాంచిన గోకవరం దేవీచౌక్ కనకదుర్గమ్మవారి శరన్నవరాత్ర ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. ఈ నెల 15 నుంచి 24 వరకూ దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. స్థానిక ఠాణా సెంటర్‌లోని మూడు కూడళ్ల వద్ద 2002 అక్టోబర్ 12న అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి మండపాన్ని నిర్మించారు. భక్తులు, గ్రామస్తులతో పాటు ఈ మార్గంలో ప్రయాణించే వారు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు మొక్కుకునేవారు. వారి మొక్కులు తీరడంతో భక్తులకు నమ్మకం పెరిగి రోజురోజుకూ అమ్మవారిని దర్శించుకునే భక్తుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. భక్తుల సహకారంతో రాజమహేంద్రవరంలో దేవీచౌక్ ఆలయాన్ని పోలినట్టు ఉండే ఆలయాన్ని నిర్మించారు. ప్రస్తుతం అమ్మవారి అంతరాలయ గోపురం వెండి తాపడం పనులు జరుగుతున్నాయి. ఇందు కోసం భక్తులు విరివిగా వెండిని సమర్పిస్తున్నారు. అమ్మవారిని ప్రతిష్ఠించిన మరుసటి ఏడాది నుంచి శరన్నవరాత్ర ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారిని వివిధ అవతారాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఆలయం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం విద్యుత్ దీపాలతో ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

వీరభద్రునిగడ్డలో..

గోకవరంలో ప్రసిద్ధిగాంచిన వీరభద్రునిగడ్డలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో దేవీనవరాత్రులను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్సవాల సందర్భంగా తొమ్మిది రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

తొమ్మిది రోజుల పాటు అలంకరణలు ఇలా..

తేదీ	అలంకరణ
15న	శ్రీబాలత్రిపురసుందరీదేవి
16న	గాయత్రీదేవి
17న	అన్నపూర్ణాదేవి
18న	మహాలక్ష్మీదేవి
19న	మహాచండీదేవి
20న	సరస్వతీదేవి
21న	లలితాత్రిపురసుందరీదేవి
22న	కనకదుర్గాదేవి
23న	మహిషాసురమర్దినీదేవి
24న	రాజరాజేశ్వరీదేవి

సంపూర్ణ భారత యాత్ర విజయవంతం



బదరీ నారాయణ బృందానికి స్వాగతం పలికిన నాట్యాచార్యులు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాధాకృష్ణ కళాక్షేత్రం ఆధ్వర్యంలో చైర్మన్ జి.బదరీ నారాయణ నేతృత్వంలో ఆగస్టు 11 నుంచి ఈ నెల 12వ తేదీ వరకూ చేపట్టిన సంపూర్ణ భారత యాత్ర విజయవంతమైంది. ఆ బృందానికి శనివారం స్థానిక కోటిపల్లి బస్టాండ్ వద్ద నాట్యాచార్యులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బదరీ నారాయణ మాట్లాడుతూ శాస్త్రీయ నృత్యం, సంగీతం, గానంతో భారతీయ సనాతన ధర్మాన్ని పునరుత్తేజం చేయాలనే లక్ష్యంతో సంపూర్ణ భారత యాత్ర చేపట్టి దిగ్విజయంగా పూర్తిచేశామన్నారు. అన్ని రాష్ట్రాల్లో తమపై ప్రతిచోటా పూల వర్షం కురిపించారని, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. తనతో పాటు ఏడుగురు నాట్య విద్యార్థులతో యాత్ర జరిగిందన్నారు. కలెక్టర్ మాధవీలత, నగరపాలకసంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ సంయుక్త ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం నుంచి ఈ యాత్ర ప్రారంభమై ఎలాంటి అవాంతరాలు లేకుండా పూర్తి చేశామని వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం ఆనం కళాకేంద్రంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో ముగింపు కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రాధాకృష్ణ కళాక్షేత్రం కార్యదర్శి గోరుగొంతు ఉమా జయశ్రీ, డైరెక్టర్ జి.లక్ష్మీదీపిక, నాట్యాచార్యులు పాల్గొన్నారు.